సీసీఎస్‌లో ఏహెచ్‌టీయూ కార్యాలయం ప్రారంభం



ఏహెచ్‌టీయూ, జేబీ కార్యాలయాలను ప్రారంభిస్తున్న సీపీ సీవీ ఆనంద్

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మానవ అక్రమ రవాణాపై ఉక్కుపాదం మోపుతున్నామని సిటీ పోలీస్ కమిషనర్ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. ఈ మేరకు సిటీ కమిషనరేట్ పరిధిలోని పాత సీసీఎస్ (సెంట్రల్ జోన్ ఉమెన్ పీఎస్ ప్రాంగణం)లో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ (ఏహెచ్‌టీయూ), జువైనల్ బ్యూరో కార్యాలయాలను మంగళవారం సీపీ ప్రారంభించారు. వాటితో పాటు.. ప్రజ్వల స్వచ్ఛంద సంస్థతో కలిసి బాధితుల కోసం ప్రత్యేక సహాయ విభాగాన్ని సీపీ ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో సీపీ వెంట క్రైమ్స్ అండ్ సిట్ అడిషనల్ సీపీ విశ్వప్రసాద్, ఉమెన్ సేఫ్టీ డీసీపీ లావణ్య, ఏహెచ్‌టీయూ ఇన్‌స్పెక్టర్ సునీత, ప్రజ్వల స్వచ్ఛంద సంస్థ ఫౌండర్ సునీతాకృష్ణన్ తదితరులు ఉన్నారు.

క్యాన్సర్‌ను త్వరగా గుర్తిస్తే నయం చేయొచ్చు



ప్లకార్డులను ప్రదర్శిస్తున్న క్యాన్సర్ విజేతలు, వారి సంరక్షకులు, వైద్య నిపుణులు, ఆస్పత్రి సిబ్బంది

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): క్యాన్సర్‌ను త్వరగా నయం చేయడానికి ఆధునిక చికిత్సలు, ప్రక్రియలు, మందులు అందుబాటులో ఉన్నాయని, త్వరగా వ్యాధిని గుర్తిస్తే నయం చేయవచ్చని మెడికవర్ ఆస్పత్రి ఆంకాలజిస్టులు పేర్కొన్నారు. మంగళవారం మాదాపూర్‌లోని మెడికవర్ క్యాన్సర్ ఇన్‌స్టిట్యూట్‌లో 'క్యాన్సర్ సర్వైవర్స్ మంత్' కార్యక్రమాన్ని నిర్వహించారు. 'సెలబ్రేటింగ్ ది సూపర్ హీరోస్' అనే థీమ్‌తో జరిగిన ఈ కార్యక్రమంలో క్యాన్సర్ విజేతలు, వారి సంరక్షకులు, వైద్య నిపుణులు, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు. క్యాన్సర్‌ను జయించిన వారి స్ఫూర్తిని, ధైర్యాన్ని పెంపొందించి, మిగతా వారిలో మనోనిబ్బరాన్ని కల్పించడానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ప్రవీణ్ క్యాన్సర్ చికిత్సలో ఎదురయ్యే సవాళ్లను వివరించారు. చిన్నపిల్లల కోసం సరికొత్త రేడియేషన్ పద్ధతుల పురోగతులను రేడియేషన్ ఆంకాలజిస్టు డాక్టర్ ప్రశాంత్ విశదీకరించారు. రోబోటిక్ సర్జరీల ప్రయోజనాలను సర్జికల్ ఆంకాలజిస్టు, రోబోటిక్ సర్జన్ డాక్టర్ రవి చందర్ వివరించారు. ఈ పద్ధతుల వల్ల మెరుగైన ఫలితాలు, త్వరితగతిన కోలుకునే అవకాశాలు మెరుగ్గా ఉంటాయని వారు వివరించారు. ఈ కార్యక్రమంలో మిసెస్ ఇండియా తెలంగాణ క్రౌన్ విజేత 2025 మితాలీ అగర్వాల్, క్యాన్సర్ సర్వైవర్స్ సుమంతి చూరుకంటి పాల్గొని తమ అనుభవాలను వివరించారు.

వృద్ధురాలికి అరుదైన చికిత్స

- 'వాచ్‌మన్' పరికరంతో వైద్యం



వైద్య ప్రక్రియలో పాల్గొన్న గ్లెనీగల్స్ ఆస్పత్రి వైద్య బృందం

హైదరాబాద్ సిటీ, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రక్తనాళాలు మూసుకుపోయి పక్షవాతం బారినపడిన ఓ వృద్ధురాలికి ఓపెన్ హార్ట్ సర్జరీ అవసరం లేకుండానే లక్డీకాపూల్‌లోని గ్లెనీగల్స్ ఆస్పత్రి వైద్య బృందం 'వాచ్‌మన్' పరికరం ద్వారా లెఫ్ట్ ఎట్రియల్ అపెండేజ్ క్లోజర్ వైద్య ప్రక్రియను విజయవంతంగా నిర్వహించారు. మంగళవారం ఆస్పత్రిలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో గ్లెనీగల్స్ ఆస్పత్రి డాక్టర్ ఎం.సాయి మాట్లాడారు. నగరానికి చెందిన 65 ఏళ్ల వృద్ధురాలికి కర్ణిక దడ వల్ల గుండె ఎడమ కర్ణిక అపెండేజ్‌లో రక్తం గడ్డకట్టి పక్షవాతంతో ఇబ్బంది పడుతుందని తెలిపారు. స్ట్రోక్ ప్రమాదాన్ని తగ్గించే ప్రత్యామ్నాయంగా కార్డియాలజీ బృందం 'వాచ్‌మన్' పరికరం ద్వారా సమస్యను సరిచేసినట్లు తెలిపారు. ఈ ప్రక్రియ ఒక గంటలోపు పూర్తయిందని, రోగి పూర్తిగా కోలుకోవడానికి కొంత సమయం పట్టిందని తెలిపారు. వాచ్‌మన్ పరికరం చిన్న పారాచూట్ ఆకారంలో ఉండే ఇంప్లాంట్ అని, ఇది కర్ణిక దడ ఉన్న రోగుల్లో ఎక్కువగా రక్తం గడ్డ కట్టే గుండె ఎడమ కర్ణిక అపెండేజ్‌ను మూసివేసే విధంగా పనిచేస్తుందని ఆయన వివరించారు. సర్జరీ చేసిన వైద్యులను ఆస్పత్రి సీఓఓ మిస్టర్ మాధ్వి ఖురానా అభినందించారు.

జనగణనలో కులగణన చేపట్టకపోతే యుద్ధమే : వీహెచ్

హైదరాబాద్, జూన్ 17(ఆంధ్రజ్యోతి): జనగణనలో భాగంగా కులగణననూ కేంద్ర ప్రభుత్వం చేపట్టకపోతే రోడ్లపైకి వచ్చి యుద్ధం చేస్తామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత వి.హన్మంతరావు హెచ్చరించారు. మంగళవారం గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. జనగణన అంటున్న కేంద్రం.. అందులో కులగణన ప్రస్తావన ఎందుకు చేయడంలేదని ప్రశ్నించారు. అగ్రకులాలకు చెందిన రాహుల్, రేవంత్‌రెడ్డి బీసీల కోసం ఆలోచన చేస్తుంటే.. బీసీని అని చెప్పుకుంటున్న ప్రధాని మోదీ మాత్రం బీసీల గురించి ఆలోచించట్లేదన్నారు. జనగణన వల్ల బీజేపీకి లాభం తప్ప.. బీసీలకు లాభం లేదన్నారు.

ఓయూలో ఆర్.నారాయణ మూర్తి



ఆర్.నారాయణ మూర్తితో విద్యార్థి సంఘాల నాయకులు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 17(ఆంధ్రజ్యోతి): పీపుల్స్ స్టార్ ఆర్.నారాయణ మూర్తి తన సినిమా 'యూనివర్సిటీ' ప్రమోషన్‌లో భాగంగా మంగళవారం ఉస్మానియా యూనివర్సిటీకి వెళ్లారు. ఓయూలోని వామపక్ష, దళిత విద్యార్థి సంఘాల నాయకులతో మాట్లాడారు. ఈ సందర్భంగా వివిధ విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఆయనను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

'హామీలను నెరవేర్చిన తర్వాతే ఆటో పర్మిట్ జీవోను అమలు చేయాలి'

నల్లకుంట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చిన తర్వాతే ఆటో పర్మిట్ జీవోను అమలు చేయాలని తెలంగాణ ఆటో అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్స్ జేఏసీ నేతలు సూచించారు. ఎల్‌పీజీ, సీఎన్‌జీ, ఎలక్ట్రిక్ ఆటోలు పాత ఆటో పర్మిట్ల స్థానంలోనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. మంగళవారం హైదర్‌గూడలోని ఎన్‌ఎస్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలంగాణ ఆటో అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్స్ జేఏసీ కన్వీనర్ రవిశంకర్ అల్లూరి మాట్లాడారు. బీఆర్‌ఎస్, వామపక్ష, ఏఐటీయూసీ అనుబంధ ఆటోడ్రైవర్ల సంఘం నేతలు ప్రభుత్వంతో లోపాయికారి ఒప్పందం చేసుకుని కొత్త ఆటో పర్మిట్లను తీసుకువచ్చి ఆటోడ్రైవర్లను మోసం చేస్తున్నారని ఆరోపించారు. సమావేశంలో తెలంగాణ ఆటో అండ్ ప్రైవేట్ ట్రాన్స్‌పోర్ట్ యూనియన్స్ జేఏసీ నాయకులు రవికుమార్, కొమరయ్య, రవి, హబీబ్, ఈశ్వర్, సాయిలు, శ్రీధర్‌రెడ్డి, సమ్మయ్య, పెంటయ్యగౌడ్, వజ్రలింగం తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల మధ్యలో చెత్తకుప్పలు

- సింగరేణి వాంబే కాలనీలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తం
- కుళ్లిన వ్యర్థాలతో దుర్వాసన
- రోడ్లపై మురుగునీరు
- పట్టించుకోని అధికారులు



సింగరేణి వాంబే కాలనీ గృహ సముదాయం



ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్తాచెదారం

సైదాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): సింగరేణి వాంబే కాలనీలో గృహ సముదాయాల మధ్య ఖాళీ స్థలాల్లో చెత్తకుప్పలు పేరుకుపోయాయి. నెలల తరబడి తొలగించకపోవడంతో కుళ్లిన వ్యర్థాలతో దుర్వాసన వెదజల్లుతుండటంతో ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని స్థానికులు ఆందోళన చెందుతున్నారు. కాలనీలో కూలీనాలి చేసుకుని బతికే పేదలు నివసిస్తున్నారు. 1,700కు పైగా గృహాలు ఉన్నాయి. కాలనీలో పారిశుధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. చెత్తకుప్పలను తొలగించడంలో మహా నగరపాలక సంస్థ పారిశుధ్య విభాగం పట్టించుకోవడం లేదని కాలనీవాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. దోమలు స్వైరవిహారం చేస్తుండడంతో రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనికితోడు తరుచూ డ్రైనేజీలు నిండి మురుగునీరు కాలనీ రోడ్లపై పారుతుండంటతో దుర్వాసనతో ప్రజలు ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తోంది.



రోడ్డుపై పారుతున్న మురుగునీరు

శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ చేపట్టాలి



ఇళ్ల మధ్య చెత్తకుప్పలు పేరుకుపోవడంతో దుర్వాసన, దోమల బాధ భరించలేకపోతున్నాం. అంటు వ్యాధులు ప్రబలుతాయని భయమేస్తోంది. సమస్యను అధికారుల దృష్టికి తీసుకెళ్తే స్పందించడం లేదు. శానిటేషన్ స్పెషల్ డ్రైవ్ నిర్వహించి పారిశుధ్య సమస్యను పరిష్కరించాలి.

- రమేష్, వాంబే కాలనీ

పట్టించుకునే వారు లేరు



ఇళ్ల మధ్య పేరుకుపోయిన చెత్తకుప్పలతో ఇబ్బందులు పడుతున్నా పట్టించుకునే నాథుడే లేడు. సమస్యను పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కరించడం లేదు.

- అమీనా, వాంబేకాలనీ

చెత్తకుప్పలు, మురుగునీటితో ఇబ్బంది



చెత్తకుప్పలు, రోడ్లపై పారుతున్న మురుగునీటితో ఇబ్బంది పడుతున్నాం. సమస్యను అధికారులు, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా స్పందించడం లేదు.

- అస్లీబాయి, సింగరేణి గుడిసెలు

మీర్‌పేట్ పెద్దచెరువు వద్ద

బాస్కెట్‌బాల్, వాలీబాల్ కోర్టులు

- సుందరీకరణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే సబితారెడ్డి



పెద్దచెరువును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సబితారెడ్డి

సరూర్‌నగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): మీర్‌పేట్‌లోని పెద్దచెరువు సుందరీకరణలో భాగంగా చెరువు సమీపంలో క్రీడాభిమానుల కోసం వాలీబాల్, బాస్కెట్ బాల్ కోర్టులు ఏర్పాటు చేయిస్తున్నట్టు మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి పేర్కొన్నారు. క్రికెట్ నెట్ ప్రాక్టీస్ కోర్టు సైతం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. చెరువు పరిసరాల్లో ఆహ్లాదకర వాతావరణం కల్పించి అక్కడకు వచ్చే సందర్శకులు కాసేపు హాయిగా గడపేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. పెద్దచెరువు వద్ద జరుగుతున్న సుందరీకరణ పనులను మంగళవారం అధికారులతో కలిసి పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలన్నారు. బతుకమ్మఘాట్, వాకింగ్ ట్రాక్, విద్యుదీకరణ, ఫెన్సింగ్ పనులను వేగవంతం చేయాలన్నారు. అనంతరం చెరువు పక్కన ఉన్న వైకుంఠధామాలను(శ్మశానవాటికలను) పరిశీలించారు. కార్యక్రమంలో మీర్‌పేట్ కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్, డీఈఈ వెంకన్న, బీఆర్‌ఎస్ మీర్‌పేట్, బడంగ్‌పేట్ శాఖల అధ్యక్షులు అర్కల కామేశ్‌రెడ్డి, రామిడి రాంరెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ దిండు భూపేశ్‌గౌడ్, మాజీ మేయర్ దుర్గ, పలువురు మాజీ కార్పొరేటర్లు, మాజీ కో-ఆప్షన్ సభ్యులు, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి చర్యలు : తహసీల్దార్

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తుల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని అబ్దుల్లాపూర్‌మెట్ తహసీల్దార్ సుదర్శన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం పెద్దఅంబర్‌పేట్, ఇంజాపూర్ గ్రామాల్లో నిర్వహించిన భూ భారతి రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొన్నారు. రెండు గ్రామాల్లో భూ సమస్యలపై 58 దరఖాస్తులు వచ్చాయన్నారు. చిన్న చిన్న భూ సమస్యలను అక్కడికక్కడే పరిష్కరిస్తున్నామన్నారు. సదస్సులు ముగిసిన అనంతరం దరఖాస్తులను పరిశీలించి పరిష్కరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నాయబ్ తహసీల్దార్ కార్తీక్‌రెడ్డి, ఆర్ఐ ఇంద్రాణి, సీనియర్ అసిస్టెంట్ నవీన్, నాయకులు పసుల రాజేందర్, పండుగుల రాజు, వడ్డేపల్లి దయాకర్‌రెడ్డి, సంజీవ పాల్గొన్నారు.



మురుగు నీటి కాల్వను శుభ్రం చేయిస్తున్న కమిషనర్ జ్ఞానేశ్వర్

వంద రోజుల యాక్షన్ ప్లాన్.. ఉద్యోగుల్లో పెరిగిన బాధ్యత

సరూర్‌నగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన వంద రోజుల యాక్షన్ ప్లాన్‌తో మునిసిపల్ ఉద్యోగులు, సిబ్బందిలో విధుల పట్ల బాధ్యత మరింత పెరిగిందని మీర్‌పేట్ కార్పొరేషన్ కమిషనర్ ఆర్.జ్ఞానేశ్వర్ అన్నారు. యాక్షన్ ప్లాన్‌లో భాగంగా మంగళవారం 1, 18, 22 డివిజన్ల పరిధిలో ఆయన పర్యటించారు. అక్కడ జరుగుతున్న మురుగు కాల్వల్లో వ్యర్థాల తొలగింపు పనులను పర్యవేక్షించారు. స్థానికులకు తడి పొడి చెత్తపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగులు, సిబ్బంది చిత్తశుద్ధితో పనిచేయడంతోపాటు కార్పొరేషన్‌ను పరిశుభ్రంగా ఉంచడంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. వంద రోజుల యాక్షన్ ప్లాన్‌లో చేపడుతున్న కార్యక్రమాలకు ప్రజలు తమ వంతు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ రమేశ్, ఎం.నర్సింహ, రాము, దాసరి రంజిత్‌కుమార్, జీవన్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ఉద్యమాల ద్వారానే ప్రజా సమస్యల పరిష్కారం



మాట్లాడుతున్న సీపీఐ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య

హయత్‌నగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారానికి ఉద్యమం ఒక్కటే మార్గం అని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం, జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. మంగళవారం పద్మావతి ఫంక్షన్ హాల్‌లో నిర్వహించిన సీపీఐ హయత్‌నగర్ మండల సీపీఐ 10వ మహాసభలో వారు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం పార్టీ జెండాను ఆవిష్కరించి మహాసభను ప్రారంభించారు. ప్రజా సమస్యలపై పోరాటం చేస్తున్న ఏకైక పార్టీ సీపీఐ అని అన్నారు. వంద సంవత్సరాల చరిత్ర గలిగిన కమ్యూనిస్టు పార్టీ భారతదేశ స్వాతంత్ర్య పోరాటంలో చురుకుగా పాల్గొందన్నారు. సీపీఐ శత జయంతి ఉత్సవాలను వాడవాడలా నిర్వహించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి సామిడి వంశీవర్ధన్‌రెడ్డి, మండల సహాయ కార్యదర్శి మర్రి శోభన్, సీపీఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఆందోజు రవీంద్రాచారి, సీపీఐ ఎల్‌బీనగర్ నియోజకవర్గం కార్యదర్శి సామిడి శేఖర్‌రెడ్డి, సీపీఐ మండల కార్యదర్శి శ్రీదేవి, నాయకులు బొంగు అరుణ్‌కుమార్‌గౌడ్, రమావత్ సక్రు నాయక్, పోలోజు లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

వరదనీటి పైప్‌లైన్ పనులు త్వరగా చేపట్టాలి



జడ్సీ హేమంత కేశవ్ పాటిల్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్లు పవన్‌కుమార్, రాధా ధీరజ్‌రెడ్డి

కొత్తపేట, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఎల్‌బీనగర్ అల్కాపురి - మూసీ వరద నీటి పైప్‌లైన్ పనులు త్వరగా చేపట్టాలని కొత్తపేట, ఆర్కేపురం కార్పొరేటర్లు పవన్‌కుమార్, రాధా ధీరజ్‌రెడ్డి జీహెచ్ఎంసీ ఎల్‌బీనగర్ సర్కిల్ జడ్సీ హేమంత కేశవ్ పాటిల్‌కు మంగళవారం విన్నవించారు. వరద నీరు లోతట్టు ప్రాంతాలైన స్నేహపురి, న్యూ నాగోల్, నాగోల్‌చౌరస్తా, సమతాపురి తదితర కాలనీల దారులను ముంచెత్తుతోందని పేర్కొన్నారు. వరదనీటి పైప్‌లైన్ పనులకు రూ. 25 కోట్లతో అంచనాలు సిద్ధం చేసి నిధులు మంజూరు చేస్తామని, రూ. 6 కోట్లతో గాయత్రీపురం నుంచి మధ్యలో ఆగిపోయిన బాక్స్ డ్రెయిన్ పనులను పునరుద్ధరించడానికి రీటెండర్ పిలిచామని జడ్సీ చెప్పారని పవన్ కుమార్ తెలిపారు.

కొత్తపేట డివిజన్‌లో ఓల్డ్ మారుతీనగర్, న్యూ మారుతీనగర్, కొత్తపేట విలేజీలలో సీసీ రోడ్లు మంజూరు చేయాలని కార్పొరేటర్ పవన్‌కుమార్ జడ్సీకి విన్నవించారు. ఎగువ ప్రాంతాల నుంచి బృందావన్ కాలనీ అంతర్గత దారుల్లో వరద నీరు ముంచెత్తుతోందని కాలనీలో రోడ్డు వేసేందుకు అంచనాలు సిద్ధం చేయాలని కోరారు. కాలనీల్లో 23 హైమాస్ట్ లైట్లు మంజూరు చేయాలని విన్నవించారు.

అల్మాస్‌గూడలో రోడ్డును మరింత విస్తరించాలి

సరూర్‌నగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): అల్మాస్‌గూడ హనుమాన్ టెంపుల్ వద్ద చేపట్టిన రోడ్డు పనులను యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకవర్గం మాజీ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి మంగళవారం పరిశీలించారు. భవిష్యత్ అవసరాల దృష్ట్యా రోడ్డును మరింత విస్తరించాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్‌ఆర్ ఎన్‌క్లేవ్ నుంచి ఆయిమాతా టెంపుల్ వరకు గల రోడ్డు మరమ్మతు పనులు చేపట్టి బోనాల నాటికి పూర్తి చేయాలని అధికారులను కోరారు.

కాలనీల పరిశుభ్రతకు కృషి చేయాలి

వనస్థలిపురం, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): కాలనీల పరిశుభ్రతకు కృషి చేయాలని హయత్‌నగర్ కార్పొరేటర్ కళ్లెం జీవన్‌రెడ్డి అన్నారు. మంగళవారం హయత్‌నగర్ డివిజన్ కమలానగర్‌లో పారిశుధ్యంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీవాసులు చెత్తను స్వచ్ఛ ఆటో కార్మికులకు ఇవ్వాలని సూచించారు. ఖాళీ ప్రదేశాల్లో చెత్త వేయొద్దన్నారు.

సీఎంఆర్ఎఫ్ ఎల్‌వోసీ పత్రాలు అందజేత

సరూర్‌నగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): నాదర్‌గుల్‌కు చెందిన విజయలక్ష్మి అనారోగ్యంతో నిమ్స్‌లో చేరగా, ఆమె వైద్యం కోసం మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి సీఎం సహాయ నిధి నుంచి రూ.75 వేలు మంజూరు చేయించారు. మంగళవారం ఎల్‌వోసీ పత్రాన్ని బాధితురాలికి అందజేశారు.

చంపాపేట: దుర్గాభవానీనగర్ కాలనీకి చెందిన విజయ కొద్దిరోజుల నుంచి గుండెకు సంబంధించిన సమస్యలతో బాధపడుతున్నారు. ఆమె భర్త పర్వతాలు ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డిని సంప్రదించగా సీఎం సహాయనిధికి దరఖాస్తు చేయించారు. సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రెండు లక్షల రూపాయల ఎల్‌వోసీ పత్రాన్ని మంగళవారం పర్వతాలుకు ఎమ్మెల్యే అందజేశారు.

అవంతి ఓపెన్ క్యాంపస్ డ్రైవ్‌లో 147 మంది ఎంపిక

చాదర్‌ఘాట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): దిల్‌సుఖ్‌నగర్‌లోని అవంతి డిగ్రీ, పీజీ కళాశాల క్యాంపస్‌లో మంగళవారం నిర్వహించిన ఓపెన్ క్యాంపస్ డ్రైవ్-2025లో ఉద్యోగావకాశాలు పొందేందుకు నగర వ్యాప్తంగా ఉన్న వివిధ కళాశాలలకు చెందిన విద్యార్థులు హాజరయ్యారు. సుమారు 86 డిగ్రీ, పీజీ కళాశాలలకు చెందిన 362 మంది విద్యార్థులు హాజరయ్యారు. 19కి పైగా మల్టీ నేషనల్ కంపెనీలకు చెందిన ప్రతినిధులు విద్యార్థులకు నిర్వహించిన ఇంటర్వ్యూలలో 147 మందిని ఎంపిక చేసుకున్నారు. మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్, ప్లే కన్సల్టింగ్ సర్వీసెస్ (ప్లేస్‌మెంట్ పార్టనర్) సహకారంతో ఓపెన్ క్యాంపస్ డ్రైవ్ నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ అప్పారావు, ఏవో మోహన్ వివరించారు.



దగ్ధమైన గృహోపకరణాలు

షార్ట్ సర్క్యూట్.. ఇంట్లో సామగ్రి దగ్ధం

సైదాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): షార్ట్ సర్క్యూట్‌తో గృహోపకరణాలు, డాక్యుమెంట్లు దగ్ధమయ్యాయి. మాదన్నపేట రేతీ కే మసీదు సమీపంలో మహ్మద్ జియాదుద్దీన్ ఇంట్లో మంగళవారం సాయంత్రం షార్ట్ సర్క్యూట్‌తో ఫ్రిజ్‌లో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో లాప్‌టాప్, టీవీ, ఫ్రిజ్, డాక్యుమెంట్లు, ఇంట్లో సామగ్రి కాలిపోయాయి.

రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ లక్ష్యం అని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు పాండి పెంటయ్య అన్నారు. రైతు భరోసా పెట్టుబడి సాయం నిధుల విడుదలపై హర్షం వ్యక్తం చేస్తూ మంగళవారం పార్టీ కార్యకర్తలతో కలిసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్ర పటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

అనాథాశ్రమంలో ఉచితంగా హెయిర్ కటింగ్

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): పెద్దఅంబర్‌పేట్‌లోని చిల్డ్రన్ ఆఫ్ డెక్కన్ ఫౌండేషన్‌లో అనాథ పిల్లలకు కర్పూరి ఠాకూర్ సామాజిక సేవా సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు అశ్విని ఆంజనేయులు మంగళవారం ఉచితంగా హెయిర్ కటింగ్ చేశాడు. సేవా కార్యక్రమంలో భాగంగా ప్రతి మంగళవారం ఒక అనాథాశ్రమంలో పిల్లలకు ఉచితంగా హెయిర్ కటింగ్ చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు మల్లన్న, పూజ పాల్గొన్నారు.

అంధుల పాఠశాలను సందర్శించిన డిప్యూటీ ఈవో

చాదర్‌ఘాట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): బడిబాటలో భాగంగా ప్రభుత్వ అంధుల పాఠశాల దారుషిఫాను బహదూర్‌పుర మండలం డిప్యూటీ ఈవో పోమ్యా నాయక్ మంగళవారం సందర్శించారు. అడ్మిషన్ పొందిన అంధ విద్యార్థులకు యూనిఫాంతోపాటు బ్రెయిలీ కిట్ అందజేశారు. కార్యక్రమంలో ఉన్నత పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు సద్గుణరెడ్డి, ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మందడి వెంకట్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓనమాలు నేర్పే ఒడి.. అంగన్‌వాడీ బడి



చిన్నారులతో అక్షరాభ్యాసం చేయిస్తున్న జిల్లా సంక్షేమ శాఖాధికారి శ్రీలత

ఎల్బీనగర్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): చిన్నారులకు మొట్టమొదట ప్రపంచాన్ని పరిచయం చేసేవి అంగన్‌వాడీ బడులేనని, వారికి ఓనమాలు నేర్పే ఒడి అంగన్‌వాడీ బడేనని రంగారెడ్డి జిల్లా సంక్షేమ శాఖ అధికారి శ్రీలత పేర్కొన్నారు. ఆర్కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ ఫేజ్-3 అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె చిన్నారులతో అక్షరాభ్యాసం చేయించారు. హయత్‌నగర్ సీడీపీఓ రేణుక, సూపర్‌వైజర్ సావిత్రి, అంగన్‌వాడీ ఉపాధ్యాయులు గంగ, పుష్పలత, సునీత, ఆశావర్కర్లు హేమలత, వెంకటమ్మ, అంజమ్మ, కళమ్మ పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యా బోధనకు ప్రభుత్వం కృషి

అబ్దుల్లాపూర్‌మెట్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైనా విద్యా బోధనకు ప్రభుత్వం కృషి చేస్తోందని గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్‌రెడ్డి తెలిపారు. మంగళవారం అనాజ్‌పూర్‌లోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా హైస్కూల్, ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతున్నారన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ సూరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సమస్యను హైడ్రా కమిషనర్‌కు వివరిస్తున్న ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయీస్ హౌస్ బిల్డింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు

సింగరేణి కాలనీలో సొసైటీ స్థలాన్ని ఇప్పించండి

సైదాబాద్, జూన్ 17 (ఆంధ్రజ్యోతి): ఐఎస్‌సదన్ డివిజన్ సింగరేణి కాలనీలోని తమ హౌసింగ్ సొసైటీకి చెందిన స్థలాన్ని ఇప్పించాలని ఇండస్ట్రీస్ డిపార్ట్‌మెంట్ ఎంప్లాయీస్ హౌస్ బిల్డింగ్ కో-ఆపరేటివ్ సొసైటీ సభ్యులు మంగళవారం హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 1981లో సర్వే నెం 65 నుంచి 77, 133(పార్ట్), 125(పార్ట్)లోని 25 ఎకరాల భూమిని నిర్దేశిత సొమ్ము చెల్లించి కొనుగోలు చేసిన స్థలాన్ని ఇప్పటి వరకు పొందలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక నాయకుల ప్రోద్బలంతో కొందరు గుడిసెలు వేసుకున్నారని హైడ్రా కమిషనర్ దృష్టికి తీసుకెళ్లారు. స్థలాన్ని తమకు ఇప్పించాలని కోరారు. హైడ్రా కమిషనర్‌ను కలిసిన వారిలో సొసైటీ మాజీ చైర్మన్ వెంకట్ రెడ్డి, కన్వీనర్ ఉదయ్‌చంద్, సభ్యులు వీరారెడ్డి, సత్యవతి, అనిల్ పాల్గొన్నారు.